

ఉన్నత విద్యకు జగనన్న దీవెన

- మొత్తం ఫీజు విద్యార్థులు, వారి తల్లుల ఖాతాల్లో జమ
- వసతి దీవెనతో లబ్ధిదారుల హర్షం
- నాలుగేళ్లలో రూ.241.19 కోట్లు అందజేత

జగనన్న విద్యా దీవెన లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు పంపిణీ
2019-20	12638	రూ. 32,10,00,034
2020-21	20364	రూ. 39,21,96,312
2021-22	14252	రూ. 23,82,72,227
2022-23	25770	రూ. 45,20,56,142

నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందజేసిన నగదు
రూ. 140,35,24,715

జగనన్న వసతి దీవెన

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు పంపిణీ
2019-20	6589	రూ. 10,67,42,994
2020-21	16394	రూ. 19,17,54,522
2021-22	9574	రూ. 8,70,58,139
2022-23	19264	రూ. 62,28,20,276

నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందజేసిన నగదు
రూ. 100,83,75,931

గాజువాక : పేదరికం కారణంగా ఏ ఒక్కరూ ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సదాశయానికి ప్రతీకగా నిలిచాయి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు. ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఈ పథకాలు అమలు చేస్తోంది. ఈ రెండు పథకాల కింద గాజువాక నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.241.19 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది.

మొత్తం ఫీజు చెల్లిస్తూ..

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నవరత్నాల కార్యక్రమంలో భాగంగా అమల్లోకి తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాల్లో జగనన్న విద్యా దీవెన పథకం ఒకటి. పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ట్యూషన్, స్పెషల్, ఎగ్జామినేషన్ ఫీజులతో సహా పూర్తి ఫీజులను రీయింబర్స్ చేయడం ద్వారా ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ప్రతీ మూడు నెలలకోసారి విద్యార్థులు, వారి తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులను జమ చేస్తోంది. ఈ పథకం కింద ఒక్క గాజువాక నియోజకవర్గంలోనే ఇప్పటివరకు రూ.140,35,24,715 ఖాతాల్లో జమ చేసింది.

చదువుతో పాటు వసతి ..

ఉన్నత చదువులతో పాటు విద్యార్థుల వసతికి కూడా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. హాస్టళ్లలో ఉంటూ చదువుకునే పేద విద్యార్థుల భోజన, వసతి ఖర్చులకు డబ్బులు చెల్లిస్తోంది. జగనన్న వసతి దీవెన పేరుతో సంవత్సరానికి రెండు విడతలుగా ఈ నిధులు మంజూరవుతున్నాయి. ఐటీఐ విద్యార్థులకు ఏడాదికి రూ.10వేలను అందిస్తోంది. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులను అభ్యసించే విద్యార్థులకు రూ.20వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. గత నాలుగేళ్లలో ప్రభుత్వం ఈ పథకం కింద గాజువాక నియోజకవర్గంలోనే రూ.100.83 కోట్లను అందజేసింది.


విద్యార్థులకు విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి (ఫైల్)

విద్యా దీవెన ఆదుకుంది



నా కుమార్తె భారతికి బాగా చదువుకోవాలనే కోరిక. కానీ, మాది పేద కుటుంబం. నా భర్త ఆటో డ్రైవర్. ఆయన సంపాదన మీదే కుటుంబం నడవాలి. ఈ పరిస్థితుల్లో బాగా చదువుకోవాలనే నా కుమార్తె కోరికను నెరవేర్చలేమేమో అనుకున్నాం. జగనన్న విద్యా దీవెన పథకం మమ్మల్ని ఆదుకుంది. ఈ పథకం ద్వారా నా కుమార్తెను గాజువాకలోని ప్రైవేట్ కాలేజీలో బీ.కాం కంప్యూటర్స్ చదివించాం. ఇప్పుడు మా కుమార్తె ఎంబీఏ చదువుకుంటోంది. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– మండల లక్ష్మి, సింహగిరి కాలనీ

జగనన్న వల్లే చదువుతున్నా..



మాది పేద కుటుంబం. నాన్న కార్పెంటర్. అమ్మ గృహిణి. మేము జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీలో ఉంటాం. నాకు బాగా చదువుకోవాలని ఉన్నా మా ఆర్థిక పరిస్థితి కారణంగా సాధ్యం కాని పరిస్థితి. జగనన్న విద్యాదీవెన పథకం వల్ల బీఎస్సీ కంప్యూటర్స్ చదువుకోగలిగాను. ఇంటర్‌తోనే ఆగిపోతుందని అనుకున్న నా చదువు డిగ్రీ వరకు సాగింది. ఇప్పుడు నా కాళ్లపై నేను నిలబడగలననే నమ్మకాన్ని ప్రభుత్వం నాలో నింపింది.

– బి.హేమ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ

ప్రభుత్వ పథకాలతోనే..



మాకు ఇద్దరు కవల పిల్లలు. నా భర్త భానుప్రకాష్ చికెన్ దుకాణం నిర్వహిస్తున్నారు. మా ఇద్దరు పిల్లలను ఎలాగోలా పదో తరగతి వరకూ చదివించాం. ఆపై వారి చదువులు ఎలా అనే సందిగ్ధంలో ఉన్న సమయంలో జగనన్న విద్యాదీవెన పథకం ఆదుకుంది. నా ఇద్దరు కుమారులు ఇంజినీరింగ్ చదువుతున్నారు. పెద్ద కుమారుడికి ఏడాదికి రూ.66వేలు చొప్పున, నా చిన్న కుమారుడికి ఏడాదికి రూ.69,400 చొప్పున నాలుగేళ్లుగా విద్యా దీవెన పథకం అందుతోంది. దీంతో వారిద్దరి చదువు సాఫీగా సాగుతోంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఆదిరెడ్డి సుజాత, స్వతంత్రనగర్

ఆకట్టుకున్న ఎక్స్ పో


ఎక్స్‌పోలో విద్యార్థుల సందడి

అగనంపూడి: స్థానిక విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఈపీఎల్ ఇగ్నైట్–2024 (ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్, లైవ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో) కార్యక్రమాన్ని కొత్తపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులు రూపొందించిన విక్టిమ్ సేవర్ సర్వైలెన్స్, రోబోటిక్స్, ఆటోమేషన్‌పై 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వివరించారు. ఇంజినీరింగ్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు అభినందించారు.

ఆచార్య పార్వతికి అభినందన


పార్వతికి డాక్టరేట్ ఉత్తర్వులను అందిస్తున్న హేమచంద్ నాయుడు

అగనంపూడి: గొన్న కళాశాల ఆంగ్ల ఆచార్యురాలు పార్వతి ఇందూరికి ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎస్.ప్రసన్నశ్రీ మార్గదర్శకత్వంలో ఆంగ్ల విభాగంలో విమెన్ ఇన్ ది నావెల్స్ ఆఫ్ సుధామూర్తి ఏ సెలెక్ట్ స్టడీ అంశంపై చేసిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆమెకు గొన్న కళాశాల సెక్రటరీ హేమచంద్ నాయుడు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్.ఎస్.మూర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిల్డ్రన్ హోమ్‌కు నిత్యావసర వస్తువుల వితరణ



వసతి గృహానికి కూరగాయలు, బియ్యం అందిస్తున్న విజయ్‌కుమార్

అగనంపూడి: సామాజిక కార్యకర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నకూటి విజయ్‌కుమార్ మంగళపాలెంలోని జీఎస్ ఫౌండేషన్ చిల్డ్రన్ హోమ్‌కు బియ్యం, కూరగాయలు, మిఠాయిలు అందించారు. విజయ్‌కుమార్ తన మనుమరాలు అక్షయ ఏంజలీనా జన్మదినోత్సవం సందర్భంగా ఫౌండేషన్‌లోని బాలలకు వీటిని అందించారు. కార్యక్రమంలో కుమారి, పి.సత్యవతి, తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

గాజువాక : నిరాశ్రయులైన పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తమ సంస్థ పని చేస్తుందని సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి అన్నారు. 50 మంది పేద మహిళలకు శుక్రవారం ఆయన కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. స్థానిక శ్రీనగర్‌లోని ఆ సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కులాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, మినిస్ట్రీస్ వైస్ చైర్మన్ ఆల్ఫ్రెడ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయలకు ఘన నివాళి


దేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక : శ్రీకృష్ణ దేవరాయలు 553వ జయంతిని స్థానిక శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గు జంక్షన్‌లోని దేవరాయల విగ్రహానికి సంఘం నాయకులు నివాళులర్పించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ దేవరాయలు విజయనగర సామ్రాజ్యంలో ప్రజలకు సువర్ణ పాలనను అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో కాపులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుడివాడ అమ్మన్న, కరణం కనకారావు, గూటూరు శంకరరావు, గడసాల అప్పారావు, జగదీష్, గంధం వెంకటరావు, నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

గాజువాక : ఈ నెల 17 నుంచి 19 వరకు అనకాపల్లి జిల్లా నాగులాపల్లిలో రాష్ట్రస్థాయి మహిళ కబడ్డీ పోటీలు, జిల్లాస్థాయి పురుషుల కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వి.రాజేశ్వరి తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానం గెలుపొందిన మహిళా జట్టుకు రూ.40వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30వేలు, మూడో స్థానానికి రూ.20వేలు, నాలుగో బహుమతిగా రూ.10వేలు నగదును అందజేస్తామన్నారు. పురుషుల విభాగంలో మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండు బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు, నాలుగో బహుమతిగా రూ.5వేల నగదు అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలు మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి తొమ్మిది గంటలకు వరకు కొనసాగుతాయన్నారు. ఈ పోటీలకు హాజరు కాగోరు జట్లు 768000566, 98856 98717 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నాణ్యమైన నిర్మాణాలే లక్ష్యం

- విశాఖ బ్రాండ్ ఇమేజ్‌కు తగినట్లుగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వెల్లడి
- 87వ వార్డులో రూ.2.33 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన నిర్మాణాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో సుమారు 2 కోట్ల 33 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.19.92 లక్షలతో కణితి కాళింగవీధిలో మహాత్మాగాంధీ గ్రంథాలయం, కణితి కాళింగవీధిలో రూ.18.09 లక్షలతో వాకింగ్ ట్రాక్, అప్పికొండ కాలనీలో రూ.1.95 కోట్లతో వి.ఆర్.సీ.సీ డ్రైనేజీ తదితర పనులు చేపట్టనున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో విశాఖ నగరం మోస్ట్ హ్యాపెనింగ్ సిటీ కానుందన్నారు. పరిపాలనా రాజధానికి తగ్గట్లుగానే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో విశాఖ బ్రాండ్ ఇమేజ్ పెరగనుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు.

ప్రజల గుండెల్లో వైఎస్సార్‌సీపీ : మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు ప్రతిక్షణం తపన పడుతూ, పదవి అంటే అధికారం కాదు .. ప్రజలపై మమకారం అని నిరూపించిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని గర్వంగా చెప్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో రైతులు, కార్మికులు, పేద, మధ్యతరగతి ప్రజలకు మమకారం అంటే ఎలా ఉంటుందో చవి చూపించిందన్నారు. టీడీపీ పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మంచిని చూసి ఓర్వలేక అబద్ధాల విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వారు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజల గుండెల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివసరావు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, చిత్రాడ రమణ, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక నేడు

గాజువాక : గుంటూరు జిల్లాలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న 33వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా జట్లను శనివారం ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఎంపిక పోటీలు పెదగంట్యాడ మండలం నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలియజేశారు. 16 ఏళ్ల లోపు వయసు, 55 కేజీల బరువు గలవారు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం 96666 55355, 80084 85344 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వేడుకగా వెంకాయమ్మ పరస


వెంకాయమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పెదగంట్యాడలో గంట్యాడ వెంకయమ్మ పరసను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గంట్యాడ గోవిందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్సీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఉర్రూతలూగించింది. అలాగే పెదగంట్యాడలోని రేలారే రేలా కార్యక్రమం ఆకట్టుకుంది.

విగ్రహావిష్కరణ

గంట్యాడ గోవిందరాజు తయారు చేయించి, పెదగంట్యాడ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన గంట్యాడ వెంకాయమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంట్యాడ సత్యారావు, మార్పుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, దల్లి గోవింద్, పులి వెంకటరమణారెడ్డి, గంట్యాడ పైడిరాజు, ఎస్.రాజారావు, కాకినాడ పెంటారావు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటా సంక్షేమ సౌరభం

- లబ్ధిదారులకు ప్రభుత్వం చేసిన మేలు వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు


హాజరైన కార్యకర్తలు, బీఎల్‌ఏలు


సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త చందు

గాజువాక : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రజలకు చేసిన మేలును నాయకులు, కార్యకర్తలు గడప గడపకు తీసుకువెళ్లాలని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) కోరారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో కలిసి బీఎల్‌ఏలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులన్నీ సిద్ధం కావాలన్నారు. అందరం కలిసికట్టుగా పని చేస్తే ఘనవిజయం సాధిస్తామని అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ 2024లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను, ప్రజలకు జరిగిన మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. గాజువాకలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేయడం ద్వారా జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహ పాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, నాయకులు కోమటి శ్రీనివాసరావు, సిరట్ల శ్రీనివాస్, పూర్ణానంద శర్మ, రెడ్డి జగన్నాథం, యువశ్రీ, ఎన్నేటి రమణ, షౌకత్ అలీ, ఎలమంచిలి అప్పారావు, మార్పు శేషు, రంబ నారాయణమూర్తి, బ్రహ్మయ్య, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథ సప్తమి


పూజలందుకున్న సూర్య భగవానుడు

పెదగంట్యాడ: రథ సప్తమి సందర్భంగా 76వ వార్డు హెచ్‌బీ కాలనీలో యువ హిందూ సాంస్కృతిక సంఘ్ ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. ఉమేష్‌సింగ్, జితేంద్ర వర్మ, ఉమేష్ శర్మ పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తున్న అర్చకులు, దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు

- హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, ఎం.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.


కన్యకాపరమేశ్వరి ఆలయంలో సూర్యనారాయణ మూర్తికి పూజలు చేస్తున్న భక్తులు

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్‌బీఎల్ ప్రాంగణంలో కొలువైయున్న శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో రథసప్తమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణలో సూర్య ప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొని పల్లకీ మోశారు. ఆలయంలో విశేష పూజలు చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం


1100వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల కార్మికుల జీవనోపాధి పోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులు, ఉక్కు నిర్వాసితుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 1100వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష సంఘాల ప్రతినిధులు, సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, గణపతిరెడ్డి, రామకృష్ణ, వర్మాల శ్రీనివాస్, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక ప్రదర్శన



సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక ప్రదర్శన


భెల్ ప్రవేశ గేటు వద్ద ఆందోళన చేస్తున్న అఖిలపక్ష సంఘాల నాయకులు

గాజువాక : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ నాయకులు గాజువాకలో శుక్రవారం కార్మిక ప్రదర్శన నిర్వహించారు. పాతగాజువాక జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన గాజువాక మెయిన్ రోడ్, సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక వరకు, తిరిగి పాతగాజువాక వరకు కొనసాగింది. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలవల్ల అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికులు తమ హక్కులను నష్టపోతున్నారన్నారు. దేశంలో ధరలు దారుణంగా పెరిగిపోయాయని, ఉద్యోగ నియామకాలు లేక నిరుద్యోగం పెరిగిపోతోందని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తే ఆందోళన మరింత తీవ్రతరమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.జగ్గునాయుడు, రాంబాబు, కె.ఎం.శ్రీను, కె.సంతోషం తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో ఉద్యోగుల అడ్డగింత

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో కొంత ఉద్రిక్తతల నడుమ సమ్మె విజయవంతంగా నిర్వహించారు. ప్రధాన గేటు వద్ద కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం విధులకు హాజరయ్యే ఉద్యోగులు, అధికారులను కార్మిక సంఘాల నాయకులు అడ్డగించారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బి.బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, సిటూ ప్రధానకార్యదర్శి ప్రకాష్, ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వేకువ నుంచి విశేష పూజలు చేశారు. అనంతరం దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, పైడిరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

దత్త సాయి ఆలయ వార్షికోత్సవం నేడు


వార్షిక వేడుకలకు ముస్తాబైన ఆలయం

కూర్మన్నపాలెం: శాతవాహన నగర్‌లోని శ్రీ దత్త సాయి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2005 ఫిబ్రవరి 17న ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి సాయినాథుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలోనే శ్రీలక్ష్మిగణపతి, శ్రీకృష్ణభగవానుడు, శ్రీసిందూర అభయాంజనేయ స్వామి, శ్రీదత్తాత్రేయుని విగ్రహాలను కూడ ప్రతిష్ఠ చేశారు. ఆలయంలో వేలాది రొట్టెలను అప్పటికప్పుడు తయారుచేసి భక్తులకు అందించడం ప్రత్యేకత. ప్రతీ గురువారం సుమారు 5000 రొట్టెలు తయారు చేసి కూరతో సహా భక్తులకు వడ్డిస్తారు. షిర్డీ మాదిరిగా చందనోత్సవం జరిపించడం మరో విశేషం. హిందువులు, ముస్లింలు కలిసి స్వామి వారిని గుర్రాలు, ఒంటెలతో ఊరేగిస్తూ నిర్వహించే చందనోత్సవాన్ని చూడడానికి రెండు కళ్లు చాలవని ఆలయ ప్రధానార్చకులు శ్రీధరస్వామి తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయినాథుడి తిరువీధి ఉత్సవం కనులపండువగా జరిగింది.